క్లుప్తంగా

అంకితభావంతో విధులు నిర్వహించాలి

చీరాల టౌన్: పరిపాలన, ప్రజలకు పథకాలను చేరువగా అందించేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. బుధవారం మండలంలోని దేవాంగపురి, గాంధీనగర్, సాల్మన్‌సెంటర్, కొత్తపాలెం గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలను ఎంపీడీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యల అర్జీలు, మొబైల్ యాప్‌డేటా, సచివాలయ ఉద్యోగుల పనితీరు, రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి కేటాయించిన ఉద్యోగుల హాజరు, శాఖల వారీ ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయాల ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు సిటిజన్ ఛార్ట్ ప్రకారం సేవలందించాలన్నారు.

మండల సర్వేయర్‌గా 'సజ్జా'


మండల సర్వేయర్‌గా విధుల్లో చేరిన లోకేష్

చీరాల టౌన్: మండల సర్వేయర్‌గా సజ్జా లోకేష్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల నిర్వహించిన సర్వేయర్ల బదిలీల్లో చీరాల మండలానికి సర్వేయర్‌గా బాపట్ల సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సర్వేయర్‌గా పనిచేస్తున్న లోకేష్‌ను చీరాలకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి మండల సర్వేయర్ శ్రీనివాసులు నుంచి రికార్డులను తీసుకున్నారు. నూతన మండల సర్వేయర్ లోకేష్ మండల తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు. సర్వేయర్‌ను పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది కలిసి అభినందించారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం ఫాల్గుణ మాసం పూర్వాషాడ నక్షత్రం నవమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

బల్లికురవ: రబీలో రైతులు సాగు చేసిన పంటలు ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేయించుకోవాలని, అభ్యంతరాలు ఉంటే ఆర్‌బీకేల్లో తెలియపరచాలని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి బుధవారం తెలిపారు. ఈ నెల 17 లోపు లిఖిత పూర్వకంగా అభ్యంతరాలు తెలిపితే.. 23న తుది జాబితా ప్రకటిస్తామని వివరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దర్శి రామకృష్ణ రావు, ఎంపీటీసీ యం. రాంబాబు, ఎంపీటీసీ యం. రామారావు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో స్వస్థత

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 సంవత్సరాల్లోపు చిన్నారులతో నిత్యం వాయామం, ఫిజియోథెరపీ పరీక్షలతో స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం వైదన గ్రామంలోని భవిత కేంద్రంలో 12 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. సాధారణ పిల్లలతో సమానంగా పెంచుతూ పౌష్టికాహారం అందించాలని కోరారు.



వైదనలో పరీక్షలు నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్టు

భౌ.. భౌ దెబ్బకు హడల్



శునకాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు

- వెంటపడుతూ కసిదీరా కరుస్తున్న వైనం
- రాత్రి సమయాల్లో మరీ ఎక్కువ..

చీరాల రూరల్: పట్టణంలో కుక్కల హల్‌చల్ చేస్తున్నాయి. జనాలను కరుస్తూ గాయాలపాలు చేస్తున్నాయి. కొన్ని సంఘటనల్లో కొందరి ప్రాణాలు కూడా పోతున్నాయి. బయటకు రావాలంటే హడలిపోతున్నారు. గుంపులుగా సంచరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. నియంత్రించాల్సిన మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదు. రాత్రి సమయంలో ప్రభుత్వాసుపత్రి రోడ్డు, ఎల్‌బీఎస్ నగర్, కోర్టు రోడ్డు, జాన్‌పేట, జయంతిపేట, మరియమ్మపేట, ఐక్య నగర్, శాంతి నగర్, పేరాల తో పాటు చీరాల రూరల్ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. శునకాలు వెంటపడుతుంటే వాహనదారులు వాటి బారి నుంచి తప్పించుకునేందుకు వాహన వేగం పెంచి.. జారిపడి గాయాలపాలవుతున్నారు. గతంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి శునకాలను నిర్మూలించేవారు. శునకాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేకంగా బండ్లు ఏర్పాటు చేసి వాటిని పట్టి బండ్లలోవేసి బయట ప్రాంతాలకు తరలించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి ఎక్కడా కనిపించడంలేదు.


చీరాల వీధుల్లో సంచరిస్తున్న శునకాలు

ఇటీవల కాలంలో తెలంగాణతో పాటు మన రాష్ట్రంలో కూడా శునకాల దాడిలో కొందరు చిన్నారులు మృతి చెందడంతో అంతా వణికిపోతున్నారు.


చీరాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఇలా..


ఈపురుపాలెంలో..

ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సిన్లు

శునకాల బారిన పడిన బాధితులు రేబిస్ వ్యాక్సిన్లు వేయించుకునేందుకు చీరాల ప్రభుత్వాసుపత్రికి పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో వ్యాక్సిన్లు కొరత లేదని ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ శేషుకుమార్ తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యాక్సిన్లు వేయించుకోవాలంటే ఎంతో ఖర్చు అవుతుందని చెప్పారు.


సిద్ధంగా యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్

నాగుల చెరువును పరిశీలించిన ఆమంచి


నాగుల చెరువును పరిశీలిస్తున్న ఆమంచి కృష్ణ మోహన్

ఇంకొల్లు (చినగంజాం): వేసవిలో తాగు నీటి ఎద్దడిని తట్టుకునేందుకు గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారులు మండల కేంద్రమైన ఇంకొల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని నాగుల చెరువును మంచి నీటితో నింపుతున్న దృష్ట్యా నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం పరిశీలించారు. బుధవారం నాగుల చెరువు వద్దకు వెళ్ళి పలు సూచనలు చేశారు. గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థలో నెలకొన్న వివిధ లోపాలను సరిదిద్దాలని, సమస్యలను పరిష్కరించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ యేజర్ల ప్రసన్న సైమన్ బాబు, మద్దినేని హనుమంతరావు, గుంటూరు శ్రీనివాసరావు, ధనుంజయ్, బండ్ల వెంకట సుబ్బారావు, పల్లెపోగు ప్రసాద్‌బాబు, నల్లతోటి సునీల్ బాబు, పాటిబండ్ల గోపాలస్వామి, చిన్ని పూర్ణారావు, అడపా సుధాకరరెడ్డి, రావిపేరయ్య, గుది యాదయ్య, పంచాయతీ వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ ప్రాణాంతకం కాదు


కారంచేడులో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, సీహెచ్‌ఓలు

కారంచేడు: టీబీ ప్రాణాంతకమైన వ్యాధి కాదని ఎంపీడీఓ ఆర్. రమేష్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు–3 సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన హెల్త్ మేళాలో పలు వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రజలకు వ్యాధి లక్షణాలు, దాని తీవ్రతపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో కళ్లె పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీంతో పాటు తరచుగా జ్వరం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు కళ్లె పడటం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నా వెంటనే మీ ఏఎన్‌ఎంలు, ఆశాల సహకారంతో టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. టీబీ లక్షణాలు బైట పడితే వెంటనే వైద్య సిబ్బంది మీకు ఉచితంగా మందులు అందిస్తారన్నారు. వీటిని క్రమం తప్పకుండా వినియోగించడం వలన వ్యాధి తీవ్రత నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, మంచి పోషక విలువలుండే ఆహారం తీసుకోవాలన్నారు. హెచ్‌వీ వసంతవల్లి, ఎంఎల్‌హెచ్‌పీ జయశ్రీ, ఎం. జగదీశ్వరి, నిర్మలమేరి, భవాని పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం


నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వేటపాలెం: రైతులు పంట భూముల్లో పంట సాగుకు ముందుగా నవధాన్యాల సాగుచేసుకోవడం ద్వారా భూమిని సారవంతం చేసుకోవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. బచ్చులవారిపాలెం, పొట్టిసుబ్బయ్య పాలెం ఆర్‌బీకేల వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ భూమిలో పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలు, పచ్చిరొట్ట ఎరువులు, ఆకు కూరలు, నూనె గింజలు, వివిధ రకాలైన విత్తనాలను కలిపి వేయడం వల్ల భూమిని సారవంతం అవుతుందని తెలిపారు. రసాయనిక ఏరువుల వాడ కాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. వీఏఏ జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సంపూర్ణ పోషణ పథకంతో మేలు


దగ్గుబాడులో జగనన్న సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న గ్రామ సర్పంచ్ ఠాగూర్

కారంచేడు: పేద మహిళలు, గర్భిణులు, బాలింతలు రక్త హీనతతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు జగనన్న సంపూర్ణ పోషణ పథకం కిట్లను ఉచితంగా అందిస్తుందని సర్పంచ్‌ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, దగ్గుబాడు గ్రామ సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. బుధవారం దగ్గుబాడు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు అందించే పథకం కిట్లను పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మంచి పోషక విలువలుండే ఆహారాన్ని ప్రతి విద్యార్థి తినేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. దగ్గుబాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేద ప్రజలకు అందించే అన్ని రకాల సేవలపై ఆయన సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యదర్శి కట్టా జ్యోత్స్న, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బైక్ నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు


బైకు నుంచి జారిపడిన వ్యక్తి

అద్దంకి రూరల్: బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి జారి పడి గాయాలైన సంఘటన మండలంలోని గోపాలపురంగ్రామ సమీపంలో చోటు చేసుకుంది. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ కోటిరెడ్డికి కుక్కకరవటంతో వైద్యం చేసుకునేందుకు బైకుమీద వస్తుండగా మండలంలోని నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్‌రహదారిపైనున్న మండలంలోని గోపాలపురం వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ తగిలి కిందపడ్డాడు. స్థానికులు 108కు సమాచారంతో అద్దంకి ప్రభుత్వవైద్యశాలకు తరలించారు.

రెండు రోజుల పాటు విద్యుత్ అంతరాయం

చీరాల: స్థానిక గంజిపాలెం 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా గంజిపాలెం, కొత్తపేట, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో గురువారం, శుక్రవారం రెండు రోజులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుంది. ఈమేరకు చీరాల డీఈ టి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు.

మత్తుతో జీవితం చిత్తు


మాట్లాడుతున్న సీఐ రోశయ్య


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

అద్దంకి: మత్తు పదార్థాల వినియోగంతో జీవితం చిత్తవుతుందని పట్టణ సీఐ రోశయ్య అన్నారు. స్థానిక కట్టా రామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు విద్యా సంస్థల్లో వేళ్లూనుకుపోతున్న మాదక ద్రవ్యాలను అరికట్టడమే లక్ష్యంగా సంకల్పం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్షణికమైన అనుభూతల కోసం మత్తు పదార్థాలను ఆశ్రయిస్తే జీవితమే చీకటి అవుతుందన్నారు. విద్యార్థులు ప్రజలు సహకరిస్తే బాపట్ల జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు ఎస్పీ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో అధ్యాపకులు, ఇతర కళాశాలల సిబ్బంది డ్రాప్ బాక్స్‌లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు పోలీసు శాఖ సహాయంతో కౌన్సెలింగ్ ఇచ్చి డ్రగ్ అడిక్షన్ సెంటర్‌లో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎక్కడైనా ఎవరైనా మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు గమనిస్తే ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెం. 8333813228 నంబరుకు, లేదా 14500 ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని కోరారు. దీనిలో భాగంగా కళాశాలకు డ్రగ్స్ ఏవేర్ ఇన్‌స్టిట్యూషన్ సర్టిఫికెట్ అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేదరమెట్ల ఎస్సై శివకుమార్ అన్నారు. బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు మేదరమెట్లలోని శారద కళాశాలలో సంకల్పంలో భాగంగా మాదక ద్రవ్యాల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్‌కు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్ పొందవచ్చన్నారు. కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమంచిని కలిసిన యద్దనపూడి నాయకులు


ఆమంచిని కలిసిన యద్దనపూడి మండల నాయకులు

యద్దనపూడి: మండలంలోని సూరావరప్పపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణ మోహన్‌ను కలిశారు. ఇంకొల్లు మండల సొసైటీ భవనంలో.. సూరావరప్పు పల్లె గ్రామానికి చెందిన బండారుపల్లి రామచంద్రబాబు కలిసి.. నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతవరం ఎంపీటీసీ దొడ్డా బ్రహ్మానందం, సురవరపు పల్లె గ్రామ సర్పంచ్ సన్నెబోయిన వెంకటప్పయ్య, చింతపల్లిపాడు నాయకులు గోరంట్ల సాంబయ్య, జంపాని కోటేశ్వరరావు, కోటి సుబ్బారాయుడు, గన్నవరం గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి వేణు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్షీరాం జయంతి

చీరాల: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం 89వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం చీరాల నియోజకవర్గ బీఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కాన్షీరాం చేసిన సేవలను కొనియాడారు. బీఎస్పీ స్థాపించి కింది వర్గాల ప్రజలను పాలకులుగా ఎదిగేలా చేశారన్నారు. రాష్ట్ర నాయకులు డి.భాస్కరరావు, జిల్లా కార్యదర్శి షేక్ షరీఫ్, జిల్లా ఇన్‌చార్జి చిట్టిమాల సంగీతరావు, నియోజకవర్గ అధ్యక్షుడు జి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయండి

బల్లికురవ: ప్రభుత్వం జగనన్న కాలనీలు, సొంత స్థలాల్లో పక్కా గృహాలను ఈనెల 22 లోపు పూర్తిసి గృహ ప్రవేశాలు చేయించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల సెక్రటరీలు, సచివాలయ సిబ్బందితో గృహనిర్మాణ లక్ష్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంకి 80 ఇల్లు నిర్మాణాలు చేపట్టలేదని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ, ఈవోఆర్డీ పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మత్స్య సంపద ప్రజలకు చేరువ కావాలి


మత్స్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

చీరాల: అత్యధిక పోషకాలున్న మత్స్య సంపదను ప్రజలకు చేరువయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.విజయకృష్ణన్ అన్నారు. మత్స్యశాఖ ద్వారా అమలవుతున్న పథకాలపై సంబంధిత అధికారులతో బుధవారం చీరాలలోని కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో సమావేశాన్ని నిర్వహించారు. మత్స్యసంపదను అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లాలోని తీర ప్రాంతం నుంచి లభ్యమయ్యే మత్స్య సంపదను మన జిల్లా, రాష్ట్ర ప్రజలకు సరిగా వినియోగించుకోవడం లేదన్నారు. అత్యధిక పోషకాలున్న మత్స్యసంపదను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ధరలు అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. పొరుగు ప్రాంతాలకు మత్స్యసంపద ఎగుమతి అవుతుందని చెప్పారు. బాపట్ల జిల్లాలో 70 యూనిట్లు స్థాపించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 33 యూనిట్లు మాత్రమే ప్రారంభించడంపై కలెక్టర్ ఆరా తీశారు. మిగిలిన యూనిట్లును ఈనెల 31వ తేదీ లోపు ప్రారంభించాలని ఆదేశించారు. అలానే సూపర్ ఫిష్ యూనిట్లు రెండు స్థాపించగా, మిగిలిన 5 యూనిట్లును త్వరగా ప్రారంభించాలన్నారు. ఫిష్ కియాస్క్ యూనిట్లు ప్రస్తుతం రెండు ప్రారంభించగా మిగిలిన 15 యూనిట్లను త్వరలో ఏర్పాటు చేయాలన్నారు. లైవ్ ఫిష్ ఆటో యూనిట్లు ఇప్పటికే రెండు పంపిణీ చేయగా, మిగిలిన 9యూనిట్లు లబ్ధిదారులకు త్వరగా అందించాలన్నారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు పి.సురేష్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు


నోటీస్ బోర్డులో తమ రూమ్ నంబర్ చూసుకుంటూ..


పరీక్ష హాలులో కూర్చున్న విద్యార్థులు

అద్దంకి రూరల్: ఇంటర్ మొదటి సవత్సరం పరీక్షలు బుధవారం అద్దంకిలో నాలుగు కేంద్రాల్లో జరిగాయి. మొత్తం 1020 మంది పరీక్షలకు హాజరవ్వాల్సి ఉండగా 966 మంది హాజరయ్యారు. 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీగోవిందాబికా, చైతన్య, విశ్వభారతి కళాశాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు తోపాటు, మంచినీటి వసతి కల్పించారు. ఉదయం 9 గంటలకల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వచ్చి నోటీస్ బోర్డులో ఉంచిన రూం నంబర్ల వారీగా పరీక్ష హాలుకు చేరుకున్నారు.

చీరాల అర్బన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. చీరాల మండలంలో ఉదయం 8.30గంటలకు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తహసీల్దార్ జి.ప్రభాకర్ పరిశీలించారు.


చీరాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జి.ప్రభాకర్

నాగమల్లేశ్వరరావుకు ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు


అవార్డు సాధించిన ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు

చినగంజాం: మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సిద్ధం నాగమల్లేశ్వరరావు ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు 2023కి ఎంపికయ్యారు. బుధవారం ఆన్‌లైన్ ద్వారా అవార్డు అందుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన అంతర్జాతీయ గుర్తింపు పొందిన మనం ఫౌండేషన్ సంస్థ గత 22 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తితో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలు గుర్తించి అవార్డుకు ఎంపికి చేసినట్లు తెలిపారు. అవార్డు అందజేసిన సంస్థ చైర్మన్ చక్రవర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్రీనివాసరావు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు పంచాయతీ నిధులు గోల్ మాల్‌పై చీరాల ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ కందిమళ్ళ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సిబ్బందిని విచారించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఎంపీడీఓ రమేష్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.